మండల పరిధిలోని గొల్లగూడలో ఏప్రిల్ 2న నిర్వహించే సచ్చిదానంద సాయనార్యుల వార్షికోత్సవం, సాందాప అచల రుషి పరిపూర్ణ గురు మందిర వార్షికోత్సకోత్సవ కార్యక్రమానికి రావాలని మాజీ మంత్రి సబితారెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న గురుమందిర వ్యవస్థాపకులు దయానంద నాగుల వెంకటేశం.
– చేవెళ్లటౌన్, మార్చి 31

టీవీ రంగయ్యకు ఉగాది పురస్కారం

ఉగాది పురస్కారం అందుకుంటున్న టీవీ రంగయ్య

షాద్‌నగర్ రూరల్, మార్చి 31: నాటకరంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారాన్ని షాద్‌నగర్‌కు చెందిన కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు టీవీ రంగయ్య అందుకున్నారు. ఆంధ్ర నాటక కళా పరిషత్ వార్షికోత్సవం, అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా హైదారాబాద్‌లోని అమీర్‌పేటలోని కమ్మసంఘంలో అదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉగాది పురస్కారం అందుకోవడం చాల సంతోషంగా ఉందని టీవీ రంగయ్య తెలిపారు. నాటక రంగంలో చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని కిమ్స్ ఆస్పత్రి ఎండీ కృష్ణయ్య, సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కమ్మ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ ఈ పురస్కారం అందజేశారని తెలిపారు. అంతరించిపోతున్న నాటకరంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. రంగయ్యకు ఉగాది పురస్కారం రావడంతో కళాకారులు రామకృష్ణ, రంగనాథం, బేజుగం రమేశ్, శివ, రమేశ్‌చారి, సింగరం శ్రీనివాస్, నారాయణచారి, మల్లికార్జున్, సత్యనారాయణ, బాలబ్రహ్మచారి, సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, మార్చి 31: మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో నీటి ఎద్దడిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లీకేజీలతో నీరు వృథా కాకుండా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధి బల్బులు పాడైతే కొత్తవి అమర్చాలన్నారు. మున్సిపాలిటీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి ఆర్థికసాయం

గౌరెల్లిలో ముస్లింలకు సాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 31 : మున్సిపాలిటీ పరిధిలోని గౌరెల్లిలో మసీదు అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు తుడుము మల్లేశ్ చేయూతనందించారు. పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం రూ.20 వేలు ముస్లింరులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీఖాన్, అబ్దుల్లాపూర్‌మెట్ బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నల్లోల పాండు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లిలోని ఈద్గాలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఆమనగల్లు : శుభాకాంక్షలు తెలుపుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఘనంగా రంజాన్ వేడుకలు

■ మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ■ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

ముస్లింల పవిత్ర, ప్రముఖ పర్వదినమైన రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ముస్లింలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- న్యూస్‌నెట్ వర్క్, రంగారెడ్డి జిల్లా, మార్చి 31

షాద్‌నగర్‌టౌన్ : ముస్లింలకుశుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ఆమనగల్లు : ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు చెబుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

షాబాద్ : ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

కడ్తాల్ : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

మొయినాబాద్ : సీఐని సన్మానిస్తున్న ముస్లింలు, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

షాబాద్ : ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

యాచారం : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్ : కొండన్నగూడలో ముస్లింలకు శుభకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్

కేశంపేట : నిర్దవెల్లిలో శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు వెంకటేశ్

కొందుర్గు : మైనార్టీలకు పండగ శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నేతలు

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత

మంచాల, మార్చి 31 : అనారోగ్యంతో బాదపడుతున్న స్నేహితుడికి తోటి మిత్రు లు అండగా నిలిచారు. మండల పరిధిలో ని జాపాల గ్రామానికి చెందిన 2002–2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య స్నేహితులు సోమవారం యాట దశరథకు రూ.60వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బకున మల్లప్ప, స్నేహితులు నర్సింహ, అశ్వల బాల్‌రాజ్, అశ్వల వెంకటేశ్, యాట భాస్కర్, అఖిల్, యాట మాదయ్య, యంతని లింగం, యాట శ్రీను, యాట పాండు, వట్టి ఐలయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అధికారుల సర్వే



హెచ్ఎండీఏ ప్రతిపాదిత రోడ్డు నిర్మాణానికి సర్వే చేస్తున్న రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు

తుర్కయాంజాల్, మార్చి 31 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి లోని సాగర్ ప్రధాన రహదారి నుంచి తొర్రూర్ వరకు హెచ్ఎండీఏ ప్రతిపాదిత రోడ్డు నిర్మాణానికి సోమవారం రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 60 ఫీట్ల ప్రతిపా దిత రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికా రులు సర్వే చేసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. హెచ్ఎండీఏ ప్రతిపాదిత 60 ఫీట్ల రోడ్డు నిర్మాణ స్థలంలో ఇప్పటికే పలు ఇండ్లు, ప్లాట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టడం సాధ్యమేనా అని అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారుల సర్వేతో ఇండ్లు, ప్లాట్ల యాజమానులు అందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు, ప్లాట్లు, రైతుల పొలాల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎండీఏ అసిస్టెంట్ సీటీ ప్లానర్ శైల, మండల సర్వేయర్ జ్యోతి, టీపీవో దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు లేక అవస్థలు

- వేసవిలో చెట్టునీడకోసం ప్రయాణికుల వెతుకులాట
- సేద తీరుదామంటే బస్సు వెళ్తుందనే భయం

కేశంపేటలో బస్ షెల్టర్ లేకపోవడంతో చెట్టు నీడలో బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

కేశంపేట, మార్చి 31: మండల కేంద్రంలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. ఆయా పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే క్రమంలో సేదతీర్చే బస్ షెల్టర్లను పల్లెల్లో ఎక్కడా కనిపించకపోవడంతోవారు చెట్టునీడకోసం వెతుకుతున్నారు. మండల పరిధిలోని 29గ్రామ పంచాయతీల్లో 20 గ్రామ పంచాయతీల్లో బస్ షెల్టర్లు లేవంటే అతిశయోక్తి కాదు. పల్లెల్లోనే బస్ షెల్టర్లు లేకపోగా గిరిజనతండాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పల్లెల్లో బస్టాండ్లులేక ప్రజలు, ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పల్లెల్లో అవసరమున్న చోట బస్ షెల్టర్లను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్ షెల్టర్లు లేని పల్లెలు..

కేశంపేట మండలంలో చాలా గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. మండల కేంద్రంలో బస్టాండ్‌తో పాటు సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలోని బాత్‌రూంల్లోకి ప్రయాణికులు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మండలంలోని దత్తాయపల్లి గేట్, పోమాల్‌పల్లి, నిర్దవెల్లి, తుర్కలపల్లి – లింగరావుపల్లి గేట్, ఇప్పలపల్లి, కోనాయపల్లి, సంతాపూర్, అల్వాల, కొత్తపేట, బైర్ఖాన్‌పల్లి గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. సంగెం, వేముల్ నర్వ గ్రామాల్లో దాతలు తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం బస్ షెల్టర్లను నిర్మించారు. లేమామిడి, పాపిరెడ్డిగూడలో దాతల కృషితో రేకుల షెడ్‌ను నిర్మించారు. గతంలో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అక్కడక్కడ ఉన్న బస్ షెల్టర్ల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెట్టు నీడనే దిక్కు..

మండల పరిధిలోని చాలా గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే సమయంలో బస్సులకోసం ఎదురు చూడాల్సి రావడం, బస్ షెల్టర్ లేకపోడంతో చెట్టు నీడను ఆశ్రయిస్తున్నారు. వేసవిలో చెట్టు ఆశ్రయమిచ్చినా వర్షాకాలంలో మాత్రం ప్రయాణికులు తడిసి ముద్ద కావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ సమయంలో ఎండ వేడిమిని తట్టుకోలేక ఏదైనా చెట్టునీడకు వెళితే బస్సు డైవర్లు ప్రయాణికులు లేరని గ్రహించి ఆగకుండా వెళ్లిపోయే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ప్రస్తుత వేసవిలో అటు చెట్టు నీడకు వెళ్లలేక ఇటు ఎండలో నిలువలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఊపందుకోని చలివేంద్రాల ఏర్పాటు..

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయా గ్రామాల ముఖ్య కూడళ్లతోపాటు బస్సులు ఆగే స్టాఫ్‌లవద్ద దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. బస్సుల్లో ప్రయాణించే వారు బస్సు ఆగగానే చలివేంద్రంలోని నీటిని సేవించి సేదతీరేవారు. ప్రస్తుతం ఎండల తీవ్రత రోజురోజుకు ముదురుతున్నా దాతలు స్పందించడం లేదు. చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పల్లెల్లోని దుకాణదారుల వద్దకు వాటర్ బాటిళ్ల కోసం పరుగులు పెడుతున్నారు. దాతలు స్పందించి చలివేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎండ తీవ్రతతో చెట్టు కింద బస్సుకోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

సేద తీరేందుకు అణువుగా లేదు..

కొత్తపేటలో సేద తీరేందుకు బస్ షెల్టర్ అణువుగా లేదు. వర్షం వస్తే సమీపంలోని వ్యాపార దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ఎండకాలంలో నీడకోసం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, షాద్‌నగర్‌కు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అత్యవసరంగా మూత్ర, మల విర్జన చేయాల్సి వస్తే ఎక్కడ వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి కొత్తపేటలో అన్ని హంగులతో బస్టాండ్‌తోపాటు సులభ్‌కాంప్లెక్స్‌ను నిర్మించాలి. - జగన్‌రెడ్డి, కొత్తపేట

బస్టాండ్ నిర్మించాలి

సంతాపూర్ గ్రామంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చెట్టు నీడను ఆశ్రయిస్తున్నారు. ఇక వర్షాకాలంలో అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వర్షం వచ్చినప్పుడు బస్సు దిగాల్సిన పరిస్థితి వస్తే తడిసి ముద్దవడం ఖాయం. బస్టాండ్ ఉండే బస్టాండ్‌లో ఎండ, వాన, చలికి ఉపశమనం దొరుకుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి సంతాపూర్‌లో బస్టాండ్‌ను నిర్మించాలి. - నరేందర్‌రెడ్డి, సంతాపూర్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, మార్చి 31 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఉగాది వసంతోత్సవాల్లో మూడవ రోజు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సోమవారం నాట్య గురువులు శీనయ్య శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. బ్రహ్మాంజలి, ప్రణమామ్యహం, జతిస్వరం, శ్రీ విజ్ఞారాజం భజే, దశావతార శబ్దం, జనుత శబ్దం, గణపతి కౌతం, హిందోళం తిల్లాన అంశాలను భవిష్య, హ్రితిక, వార్షిత, హంసిని, సిద్ధి, మేఘన, శాన్వి, ఈషా కృష్ణ, సాన్విక, గౌరీ, రుషిక, ఇందీవరా, సమీనా, ధ్రువి, జాన్వీ, రిద్ధి, దీప్సిక ప్రదర్శించి మెప్పించారు.

గ్రూప్-1 ఐదో ర్యాంకర్ కృతికకు సన్మానం

బడంగ్‌పేట్, మార్చి 31: గ్రూప్ –1లో స్టేట్ ఐదో ర్యాంక్ సాధించిన సిద్ధాల కృతికను మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు జలాల్పూర్ సునీతా బాలరాజ్ సోమవారం ఘనంగా సత్కరించారు. జిల్లెలగూడలోని నివాసానికి వెళ్లి కృతికకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కాగా కృతిక బీఆర్ఎస్ మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షురాలిగా, సరూర్ నగర్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా, జిల్లెలగూడ కార్పొరేటర్‌గా పనిచేసిన సిద్ధాల లావణ్య–బీరప్ప దంపతుల కుమార్తె. కృతిక ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. తన కుమార్తె రేయింబవళ్లు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని తల్లిదండ్రులు సిద్ధాల లావణ్య బీరప్ప సంతోషం వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదం దురదృష్టకరం

ఆమనగల్లు, మార్చి 31 : చైత్ర రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని చైత్ర రెస్టారెంట్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. సోమవారం వారు కాలిపోయిన రెస్టారెంట్‌ను పరిశీలించారు. నిర్వాహకుడు చాట్ల శ్రీనును పరామర్శించారు. ఎంత మేరకు నష్టం వాటిల్లిందని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు గీతా కార్మికుడు మృతి

మంచాల మార్చి 31 : తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారడంతో చెట్టుపై నుంచి పడి కల్లుగీతా కార్మికుడు మృతి చెందిన ఘటన మంచాల పోలీస్టేషన్ పరిధిలోని ఆరుట్లలో సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్సై లాలయ్య తెలిపిన వివరాలు.. ఆరుట్లకు చెందిన పాశం బుచ్చయ్య గౌడ్ (58) రోజు వారీగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీసేందుకు ఎక్కుతున్న బుచ్చయ్య గౌడ్ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. బంధువుల ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు కేశంపేటలో సన్న బియ్యం పంపిణీ

కేశంపేట, మార్చి 31 : కేశంపేట మండల కేంద్రంలోని షాపు నెంబర్ 1540004లో రేషన్‌కార్డు దారులకు మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ మీర్ ఆజంఅలీ సోమవారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ చేస్తారని తెలిపారు. ఆయా గ్రామాల నేతలు, లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.